సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 13 । జూలై । 2025



తండాలకు వెళ్లాలంటే..

లింగంపేట మండలంలోని పలు తండాల రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రజలు ఆ రోడ్లపై నడవడానికీ ఇబ్బందిపడుతున్నారు.

- 9లో ▸



ప్రహరీ కరువు

దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పశువులు యథేచ్ఛగా ఆవరణలోకి వస్తున్నాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.2 /23.2

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

వనంలో కొలువైన అమ్మలు

- ప్రకృతి ఒడిలో ఆలయాలు
- ఏటా ఆషాఢ మాసంలో ఘనంగా జాతరలు
- మొక్కులు తీర్చుకునేందుకు ఏడాదంతా పండుగలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో అటవీ ప్రాంతాలు, గుట్టలు, చెరువు గట్ల వద్ద గ్రామ దేవతల ఆలయాలు ఉన్నాయి. దోమకొండ మండలంలోని అంబారీపేట శివారులో గుట్టపై వెలిసిన గుట్ట మైసమ్మ, నస్రుల్లాబాద్ మండలంలోని మైలారంలో కొచ్చెరు మైసమ్మ, లింగంపేట మండలంలోని కేశాపూర్–కోమట్‌పల్లిలోని అల్లూరమ్మ, లింగంపేట మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ, జుక్కల్ మండలంలోని కౌలాస్ కోటపై వెలిసిన ఎల్లమ్మ, కామారెడ్డి పట్టణానికి సమీపంలోని ఉగ్రవాయి మైసమ్మతో పాటు ఎన్నో ఆలయాలు ప్రకృతి ఒడిలో భక్తుల నుంచి పూజలందుకుంటున్నాయి. ప్రకృతి ఒడిలో కొలువుదీరిన ఈ దేవతామూర్తులను దర్శించుకునేందుకు ఏటా వేలాది మంది భక్తులు వస్తుంటారు. కోరిన కోరికలు తీరుతాయన్న నమ్మకంతో తమ కష్టాలు తీరాలని ముడుపులు కట్టడం, మొక్కుకోవడం.. అవి తీరిన తర్వాత యాటలు కోసి దేవుళ్లకు పండుగలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రకృతి ఒడిలో ఉన్న ఆలయాల వద్ద ఆదివారాల్లో పెద్ద ఎత్తున పండుగలు చేస్తుంటారు. మిగతా వారాల్లోనూ సందడి కనబడుతుంది.



లింగంపేట మండలం కేశాయిపేట శివారులోని అల్లూరమ్మ ఆలయం

సండే స్పెషల్

ఎల్లవేళలా వెన్నంటి వుండే తల్లి ఎల్లమ్మ. ఆపదలనుంచి కాపాడే అమ్మ పోచమ్మ. దుష్టులను దునుమాడి, శిష్టులను కాపాడే శక్తి స్వరూపిణి మైసమ్మ. గ్రామ దేవతలుగా పిలవబడుతున్న ఈ అమ్మలు.. భక్తుల కొంగుబంగారంగానూ పూజలందుకుంటున్నారు. జిల్లాలో పలు గ్రామ దేవతల ఆలయాలు ప్రకృతి ఒడిలో ఉన్నాయి. ఆ ఆలయాలలో ఏటా ఆషాఢంలో ఘనంగా జాతరలు జరుగుతాయి. మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు ఏడాదంతా పండుగలు నిర్వహిస్తారు. వనంలో కొలువుదీరిన గ్రామదేవతల ఆలయాలపై సండే స్పెషల్..

కోరిన కోరికలు తీర్చే అల్లూరమ్మ..



లింగంపేట మండలంలోని కేశాయిపేట–కోమట్‌పల్లి గ్రామాల శివారులో చెరువు గట్టున ఉన్న అల్లూరమ్మ ఎన్నో కుటుంబాలకు ఇంటిదేవతగా బాసిల్లుతోంది. సంతానం లేని దంపతులు మొక్కుకుంటే సంతానం కలుగుతుందన్న నమ్మకం ఉంది. ఇక్కడకు వచ్చి ముడుపులు కడితే కోరికలు తీరుతాయంటారు. ఆలయానికి ఆది, సోమ, మంగళ, గురు, శుక్రవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అప్పట్లో చెట్టుకింద ఉన్న అమ్మవారికి భక్తులు దాదాపు రూ. 35 లక్షలు జమ చేసి, ఆలయాన్ని నిర్మించారు. మొక్కులు తీర్చుకునేందుకు మేకలు, గొర్రెలు, కోళ్లు కోస్తారు. ఏటా జూన్ మొదటి వారంలో ఆలయం వద్ద ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహిస్తారు. అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. కుస్తీపోటీలు నిర్వహిస్తారు. లింగంపేట మండల ప్రజలతో పాటు చుట్టుపక్కల మండలాలు, పొరుగున ఉన్న మెదక్ జిల్లాకు చెందిన వారు కూడా తమ సంతానానికి అల్లూరు, అల్లూరయ్య, అల్లూరమ్మ అన్న పేర్లు పెట్టుకుంటారు.

కౌలాస్ కోటలో ఎల్లమ్మ..



జుక్కల్ మండలంలోని కౌలాస్ కోటలో గుట్టపై భాగాన ఉన్న ఎల్లమ్మ ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. కౌలాస్ కోట ద్వారా పాలన సాగిన కాలం నుంచి ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ రాజవంశీయులు ఆలయానికి వచ్చి పూజలు చేస్తారు. ప్రతి శుక్ర, మంగళ, ఆదివారాల్లో భక్తులు వచ్చి పండుగలు చేసుకుంటారు. గుట్ట మీద అటవీ ప్రాంతంలో ఉన్న ఆలయానికి చుట్టుపక్కల మండలాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. హైదరాబాద్ నుంచి కూడా భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. చాలా కుటుంబాలకు ఈ ఎల్లమ్మ ఇంటి దేవతగా ఉంది.

గుట్టపై వెలిసిన మైసమ్మ...



దోమకొండ మండలం అంబారీపేట గ్రామ శివార్లలో బండరాళ్ల గుట్టలపై వెలసిన మైసమ్మ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. చాలా కుటుంబాలు ఇంటి దేవతగా కొలుస్తాయి. పిల్లల పుట్టు వెంట్రుకలు తీసి పెద్ద ఎత్తున పండుగలు చేస్తారు. మైసమ్మకు మొక్కితే కోరికలు తీరుతాయని నమ్మిన వాళ్లు.. కోరిక నెరవేరగానే పెద్ద పండుగ చేస్తారు. ఆలయానికి సమీపంలో చెట్ల కింద, షెడ్ల కింద వంటలు చేసుకుంటారు. ఒక్కోసారి ఆదివారం పూట వేలాది మందితో ఆ ప్రాంతం కిటకిటలాడుతుంది. ఏడెనిమిదేళ్లుగా ఆషాఢంలో బోనాలు సమర్పిస్తున్నారు. ప్రతి ఇంటి నుంచి బోనం వెళుతోంది.

మత్తడి పోచమ్మ..



లింగంపేట మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ఏటా ఉగాది సందర్భంగా వారం పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఎడ్ల బండ్ల ప్రదర్శన, రథోత్సవం, కుస్తీ పోటీలు వంటి కార్యక్రమాలుంటాయి. ఆదివారం, మంగళవారం, శుక్రవారం ఎక్కువగా భక్తులు వస్తారు. ఊరి చివరన ఉన్న ఆలయం వద్దకు భక్తులు తరలివచ్చి మేకలు, గొర్రెలు కోసి మొక్కులు తీర్చుకుంటారు. ఎక్కడెక్కడి నుంచో భక్తులు వచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. రూ. 45 లక్షలతో ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

చెరువు గట్టున కొచ్చెరు మైసమ్మ..





నస్రుల్లాబాద్ మండలం మైలారంలోని కొచ్చెరు మైసమ్మకు ఎంతో చరిత్ర ఉంది. రెండు వందల ఏళ్ల కిందట భారీ మర్రి వృక్షం కింద మైసమ్మ వెలిసిందని చెబుతారు. చెరువు గట్టున వెలసిన అమ్మవారిని కొచ్చెరు మైసమ్మగా కొలుస్తారు. మంగళ, శుక్ర, ఆదివారాల్లో బాన్సువాడ, జుక్కల్ ప్రాంతాల నుంచే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ప్రతి వారం దాదాపు వందకుపైగా మేకలు, గొర్రెలు కోస్తారు. ఆషాఢ మాసం చివరి శుక్రవారం అమ్మవారికి బోనాలు తీస్తారు. చాలా కుటుంబాలు ఇంటి దేవతగా కొచ్చెరు మైసమ్మను కొలుస్తారు. చెరువు గట్టున ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న ఆలయం వద్దకు బంధువులు, స్నేహితులతో తరలివచ్చి వంటలు వండుకుని విందు భోజనాలు ఆరగిస్తారు.

న్యూస్‌రీల్

'భారతీయ సంస్కృతిలో గురువుకు ప్రత్యేక స్థానం'



కామారెడ్డి అర్బన్: భారతీయ సంస్కృతిలో గురువుకు ప్రత్యేక స్థానం ఉందని హైకోర్టు న్యాయవాది విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐఎంఏ భవనంలో సంస్కార భారతి ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనటరాజ పూజ నిర్వహించి స్థానిక కూచిపూడి కళాక్షేత్రం కళాకారులతో నృత్యోత్సవం నిర్వహించారు. నాట్య గురువు వంశీ ప్రతాప్‌గౌడ్, శాస్త్రీయ సంగీత కళాకారిణి సుహాసిని, జానపద కళాకారుడు రెడ్డి రాజయ్యలను సన్మానించారు. ముగ్గురు కళాకారులకు సంబంధించిన శిష్యులు ప్రదర్శనలు ఇచ్చారు. సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సమ్మిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాతూరి సత్యప్రసాద్, ప్రతినిధులు డాక్టర్ ఎస్.రాజు, సాయిబాబా, స్వామిగౌడ్, బసంత్‌రాజు, ప్రశాంతి, శర్వాణి తదితరులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో డీసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

కామారెడ్డి అర్బన్ : డీఈఈ సెట్‌లో ఉత్తీర్ణులై గతంలో సర్టిఫికెట్ల పరిశీలనలో పాల్గొననివారు ఈనెల 14, 15 తేదీల్లో నిజామాబాద్ డైట్ కళాశాలలో నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలనలో పాల్గొనాలని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకుని సీటు పొందని వారు, సీటు పొంది కళాశాలలో చేరని వారు ఈనెల 16న వెబ్ ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. 19న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 63039 63931 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'బీసీ డిక్లరేషన్ అమలేది'



కామారెడ్డి టౌన్: ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలేది అని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారన్నారు. మహారాష్ట్ర, బిహార్ రాష్ట్రాలలో చట్టబద్ధత కల్పించినా రిజర్వేషన్లు అమలు కాని విషయాన్ని గుర్తు చేశారు. బీసీల మీద కాంగ్రెస్‌కు ప్రేమ ఉంటే డిక్లరేషన్‌లోని ఇతర అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 18 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కోసం ఏం చేసిందో స్పష్టం చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్‌రావు, కపిల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు కామారెడ్డిలో అప్రెంటిస్‌షిప్ మేళా

బిచ్కుంద: ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసినవారికి అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించి ప్రముఖ కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. స్కిల్ ఇండియా మిషన్ కింద ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా(పీఎంఎన్ఏఎం) నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం కామారెడ్డిలోని శ్రావణి ఐటీఐ కళాశాలలో అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ మేళాలో ఎల్‌అండ్‌టీ, ఐటీసీ ఫుడ్ డివిజన్, వరుణ్ మోటార్స్, మహీంద్రా మోటార్స్ ప్రతినిధులు పాల్గొననున్నారు. అప్రెంటిస్‌షిప్ శిక్షణ అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో, వివిధ పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశాలు ఉంటాయని బిచ్కుంద ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ప్రమోద్ కుమార్ తెలిపారు. జిల్లాలో చాలా మంది యువకులు ఐటీఐ, డిప్లొమా చేసి అప్రెంటిస్‌షిప్ చేయడం లేదని, దీంతో వారికి ఉద్యోగావకాశాలు తక్కువగా లభిస్తున్నాయని పేర్కొన్నారు. యువత బంగారు భవిష్యత్తు కోసం కేంద్రం స్కిల్ ఇండియా మిషన్ ద్వారా అప్రెంటిస్‌షిప్ ఇప్పిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగలవారు అన్ని సర్టిఫికెట్లతో మేళాకు రావాలని సూచించారు.

ఘనంగా మహంకాళి తొట్టెల ఊరేగింపు

బీబీపేట: మండల కేంద్రంలోని మహంకాళి అమ్మవారి తొట్టెల ఊరేగింపును శనివారం శివశక్తి ఉత్సవ కమిటీ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాఢంలో బోనాలను సమర్పిస్తారు. ఈసారి ప్రత్యేకంగా తొట్టెల ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా పోతరాజులు తమ విన్యాసాలతో అలరించారు. మండలకేంద్రంలోని అన్ని వీధుల మీదుగా ఈ శోభాయాత్ర సాగింది. గ్రామస్తులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



శోభాయాత్రలో పోతరాజుల వేషధారణ

కిక్కిరిసిన మేకల సంత

నవీపేట: మండల కేంద్రంలో శనివారం జరిగిన మేకల సంత వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసిపోయింది. ఈ ఆదివారం జిల్లా కేంద్రంతోపాటు వివిధ గ్రామాలలో ఊర పండుగలు, బోనాల సంబురాలు నిర్వహిస్తుండడంతో సంత ప్రాంగణం సందడిగా మారింది. ఆషాఢ మాసంలో ఆనవాయితీగా సాగే వన భోజనాలు కూడా ఈ ఆదివారం ఉండడంతో వ్యాపారులకు కలిసి వచ్చింది. దీంతో జీవాల రేట్లు అమాంతం పెంచేశారు. ఒక్కో మేక ధర రూ. 7 వేల నుంచి రూ. 10 వేలకు విక్రయించారు. అలాగే పొట్టేలు (మేక పోతు) రూ. 12 వేల నుంచి రూ. 15 వేలకు విక్రయించారు. ధరలను లెక్క చేయకుండా వినియోగదారులు పోటాపోటీగా కొనుగోళ్లు చేశారు. సంతలో రూ. 3 నుంచి రూ. 4 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.



నవీపేటలో సందడిగా ఉన్న మేకల సంత

చదువులు సాగేదెలా?

- దుర్కి సంక్షేమ బాలికల విద్యాలయంలో నగం పోస్టులు ఖాళీ
- ముందుకు సాగని బోధన
- నష్టపోతున్న విద్యార్థినులు

నస్రుల్లాబాద్: దుర్కిలోని సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల/పాఠశాలలో టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. ప్రధానంగా సబ్జెక్ట్ టీచర్లు లేకపోవడంతో బోధన ముందుకు సాగడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులతో ప్రథమ, ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నారు. గతేడాది వరకు 5, 6, 7 తరగతులు ఉండగా.. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 8వ తరగతికి అప్‌గ్రేడ్ అయ్యింది. మొత్తం 440 సీట్లు ఉండగా ప్రస్తుతం 348 మంది అడ్మిషన్లు పొందారు. ఇందులో ఇంటర్‌లో 55 మంది విద్యార్థినులున్నారు. మిగిలినవారు పాఠశాల విద్యార్థులు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు బోధించడానికి 20 మంది టీచర్లు అవసరం.



సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల భవనం

అయితే ప్రస్తుతం 11 మంది మాత్రమే ఉన్నారు. పాఠశాల విద్యలో మాథ్స్, సైన్స్, సోషల్‌తోపాటు ఇంగ్లిష్ బోధించేవారు లేరు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి. కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్ పోస్టు సైతం ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేసిన కెమిస్ట్రీ అధ్యాపకురాలు ఇటీవల హాస్టల్‌లో విధులు నిర్వహిస్తూ అనుమానాస్పద స్థితిలో మరణించారు. దీంతో ఈ పోస్ట్ కూడా ఖాళీగా ఉంది. దీంతో విద్యార్థులకు పాఠాలు బోధించేవారు లేక నష్టపోతున్నారు.

పనిభారంతో ఒత్తిడి..

చాలా పోస్టులు ఖాళీగా ఉండడంతో పార్ట్‌టైం ఉద్యోగులపై పనిభారం పడుతోంది. దీంతో ఒత్తిడికి గురవుతున్నారు. ఇటీవల పాఠశాలలో రాత్రి విధులు నిర్వహించిన కెమిస్ట్రీ లెక్చరర్ మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఆమె మరణించినప్పటినుంచి రోజూ నలుగురు టీచర్లకు నైట్ డ్యూటీలో ఉంటున్నారు. రోజు విడిచి రోజు నైట్ డ్యూటీ చేయాల్సి వస్తుండడంతో పని ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



పాఠశాలలో అధ్యాపకుల కొరత ఉంది. ఈ విషయాన్ని పలుమార్లు ఆర్‌సీవో దృష్టికి తీసుకువెళ్లాం. వారు నోటిఫికేషన్ వేస్తామంటున్నారు.

– శ్యామలాదేవి, ప్రిన్సిపల్, సాంఘిక సంక్షేమ పాఠశాల

మారనున్న వీధి రాత

- మున్సిపాలిటీల్లో వీధి వ్యాపారులతో పొదుపు సంఘాల ఏర్పాటు
- బ్యాంకుల నుంచి రుణం పొందే అవకాశం కల్పించనున్న మెప్మా

బాన్సువాడ : వీధి వ్యాపారులను పొదుపు వైపు మళ్లించి వ్యాపార అభివృద్ధికి బ్యాంకుల ద్వారా రుణాలిప్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందులో భాగంగానే జిల్లా పరిధిలోని మూడు మున్సిపాలిటీల్లో కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్(సీఐజీ)లను ఏర్పాటు చేయడానికి మెప్మా సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు మున్సిపాలిటీల్లో 101 వరకు సంఘాలు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ప్రతి గ్రూప్‌లో 5 నుంచి 10 మంది సభ్యులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మొదటి విడతగా మొత్తం 7,910 మంది వీధి వ్యాపారులను గుర్తించారు. వీరితో ఏర్పాటు చేసే గ్రూపుల్లో ఎంపిక చేసిన సంఘాల్లోని సభ్యులకు ముందుగా శిక్షణ ఇవ్వనున్నారు. వారు బ్యాంకు ఖాతాలు తెరిచిన వెంటనే సంఘాల పొదుపు ప్రక్రియను పరిశీలించి బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించనున్నారు. ఆరు నెల తర్వాత సంఘాలకు మొదటి విడతగా రూ.లక్ష, తర్వాత రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు, సకాలంలో చెల్లిస్తే రూ.10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు రుణం పొందవచ్చు. అలాగే వీధి వ్యాపారులు ప్రత్యేకంగా వ్యాపారం చేసుకోవడానికి వీలుగా పీఎంశ్రీ నిధి పథకం కింద దుకాణాలు నిర్మించనున్నారు. మున్సిపాలిటీల పరిధిలో రేకుల షెడ్లు నిర్మించి వీధి వ్యాపారులకు కేటాయించనున్నారు.



పొదుపు సంఘాలపై వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సభ్యులకు బీమా సదుపాయం..

పొదుపు సంఘంలో సభ్యులుగా చేరిన వ్యాపారులకు రూ. 2లక్షల బీమా సదుపాయం కల్పించనున్నారు. ప్రమాదవశాత్తు సభ్యులు మృతి చెందితే వారికి బీమా వర్తిస్తుంది. ఈ మేరకు వీధి వ్యాపారులకు ఆయా మున్సిపాలిటీల పరిధిలో గుర్తింపు కార్డులు అందజేస్తారు. దుకాణాలు కేటాయించిన అనంతరం వారితో పట్టణ వ్యాపారుల కమిటీని ఏర్పాటు చేయనున్నారు. కమిటీ చైర్మన్‌గా మున్సిపాలిటీ కమిషనర్ ఉంటారు.

మున్సిపాలిటీ	వీధి వ్యాపారులు	సంఘాలు
కామారెడ్డి	5,496	69
బాన్సువాడ	1,402	19
ఎల్లారెడ్డి	1,012	13
మొత్తం	7,910	101

ఆరునెలల తర్వాత రుణాలిప్పిస్తాం



జిల్లాలో మూడు మున్సిపాలిటీలలో వీధి వ్యాపారులతో పొదుపు సంఘాలు ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో ఏర్పాటయ్యే సంఘాలకు ఆరు నెలల తర్వాత బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తాం. దీంతో వారికి వెసులుబాటు కలుగుతుంది. కుటుంబాలను పోషించుకోవడానికి అవకాశం ఉంటుంది.

–శ్రీధర్‌రెడ్డి, మెప్మా పీడీ, కామారెడ్డి

కిసాన్‌నగర్‌లో విజృంభించిన డెంగీ

20 మందికి పాజిటివ్ ■ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు

మాచారెడ్డి: పాల్వంచ మండలం భవానీపేట గ్రామపంచాయతీ పరిధిలోని కిసాన్‌నగర్‌లో డెంగీ విజృంభిస్తోంది. గ్రామంలో ఇంటికొకరు చొప్పున జ్వరంతో మంచం పట్టారు. వారం రోజుల నుంచి జ్వరాలతో బాధపడుతున్నారు. పలువురికి డెంగీ పాజిటివ్ రావడంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరి చికిత్సలు పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ వైద్య సిబ్బంది శనివారం కిసాన్‌నగర్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా జ్వరాలతో బాధపడుతున్నారని మండల వైద్యాధికారి ఆదర్శ్ తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైనవారికి మందులు పంపిణీ చేస్తున్నామని, డెంగీ బాధితులను కామారెడ్డిలోని జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో దోమల నివారణ చర్యలు చేపట్టామన్నారు. ఈ శిబిరంలో ఏఎన్ఎం సుమలత పాల్గొన్నారు.



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది



ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

క్లుప్తంగా

అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేత



ఎల్లారెడ్డి: మండలంలోని రత్నాపూర్ అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని దుండగులు అక్రమంగా చెట్లను నరికి వేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీప్రాంతంలో తరచు చెట్లను నరికి వేయడంతో ఇటీవల అటవీశాఖ అధికారులు వచ్చి, పరిశీలించారని, కానీ చెట్లు నరికిన వారిని గుర్తించ లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అటవీ ప్రాంతంలో చెట్లు నరకకుండా నిఘా పెంచాలని వారు కోరుతున్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు



లింగంపేట(ఎల్లారెడ్డి): మైనర్లు వాహనాలను నడపడానికి ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై దీపక్‌కుమార్ అన్నారు. మండలంలోని లింగంపల్లి చౌరస్తా వద్ద శనివారం ఎస్సై దీపక్‌కుమార్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా పెండింగ్‌లో ఉన్న చలాన్లు వసూలు చేసినట్లు తెలిపారు. అలాగే ఒక డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏఎస్సై మధుసూదన్ కానిస్టేబుల్ రాజు, మురళి, జయ్, లక్ష్మన్, రవి, మదన్‌లాల్ పాల్గొన్నారు.

వామ్మో..146 చక్రాల లారీ



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారిపై శనివారం రెండు భారీ వాహనాలు వెళ్లడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. సాధారణంగా లారీకి 12, 14, 16 చక్రాలు ఉండడం చూశాం. కానీ హైదారాబాద్ నుంచి మద్నూర్ మీదుగా మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణానికి భారీ ఎలక్ట్రానిక్ మిషన్ లోడ్‌తో వెళ్తున్న లారీకి 146 చక్రాలున్నాయి. పది రోజుల క్రితం బయలుదేరామని మరో వారం రోజుల్లో నాందేడ్‌కు చేరుకుంటామని డ్రైవర్లు తెలిపారు.

విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించండి



మాచారెడ్డి: ఫరిద్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పాల్వంచ మండల పరిధిలోని ఫరిద్‌పేట సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వరి నాట్లు వేసే సమయంలో విద్యుత్ కోతలను విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ట్రాన్స్‌కో ఏఈ జ్యోతి రైతులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. తదుపరి సబ్‌స్టేషన్ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

వర్షంలో డ్రైవింగ్ జాగ్రత్త!

- జిల్లాలో ఏటా వర్షాకాలంలో 10 నుంచి 15 మంది మృత్యువాత
- వాహనాల వేగం తగ్గిస్తేనే ప్రమాదాల నివారణ



ఖలీల్‌వాడి: వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా అవుతుంటాయి. వర్షంకు వాహనాలపై వెళ్లేటప్పుడు స్కిడ్ అయి పడిపోయి మృతి చెందిన ఘటనలు జిల్లాలో ఉన్నాయి. బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలపై వెళ్లేటప్పుడు వాహనదారులు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించడానికి అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో వర్షం కురిసే సమయంలో అతివేగంగా వెళ్లడంతో జిల్లాలో ప్రతి యేటా పదుల సంఖ్యలో వాహనదారులు మృతి చెందుతున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ రోడ్డు ప్రమాదాల్లో భారీ వాహనాలు, కార్లు, ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురై, మృతి చెందుతున్నారు. ఎక్కువగా ద్విచక్ర వాహనాదారులే వర్షాకాలంలో ప్రమాదాలకు గురై, మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. వర్షంలో తొందరగా గమ్యస్థానాలకు వెళ్లడానికి స్పీడ్‌గా వెళ్లిన ద్విచక్ర వాహనదారులు వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. దీంతోపాటు రోడ్డుపై గాని బురదలో గాని బండ్లు స్కిడ్ కావడంతో పడిపోయి ప్రమాదానికి గురవుతున్నారు. రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలిచిఉండగా అందు లోనుంచి వెళ్లకపోవడమే మంచిది.

ప్రయాణంలో ఇవి పాటించాలి..

- దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు వాహనానికి కావాల్సిన పెట్రోల్ ఎంత అవసరం అవుతుందో అంతమేర ముందుగానే పోసుకోవాలి. దీనితోపాటు టైర్లలో గాలిని చెక్ చేసుకోవాలి. వాహనంను బట్టి 30 నుంచి 35 పీఎస్సై వరకు గాలి చూసుకోవాలి.
- ప్రతి వాహనం 150 నుంచి 200 కిలోమీటర్ల వెళ్లిన తర్వాత వాహనాలను 5 నిమిషాల పాటు ఆపాల్సి ఉంటుంది. దీంతో డ్రైవర్లు కొంత సేదతీరుతుంటారు.
- వర్షంలో వాహనంతో స్పీడ్‌గా వెళ్తే ప్రమాదాలు జరుగుతాయి. వర్షాలకు వాహనాలు స్కిడ్ కావడంతోపాటు డ్రైవర్ చేతిలో నుంచి కంట్రోల్ తప్పుతాయి.
- వర్షకాలంలో ఆర్టీసీ బస్సులు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వెళ్లాలి. అలాగే కార్లు, ఇతర వాహనాలు 80 కిలో మీటర్ల కంటే ఎక్కువగా వెళ్లరాదు. ద్విచక్రవాహనదారులు 40 కిలోమీటర్ల వేగం కంటే ఎక్కువగా వెళ్లరాదు.
- నాలుగు టైర్ల వాహనాదారులు ముందు ఉండే గ్లాస్‌తోపాటు వైపర్లు మంచిగా ఉంచుకునేలా చూడాలి.
- వాహనాల అద్దాలు బాగుంటేనే వర్షంలో వెళ్లేటప్పుడు ముందు కనిపించే వాహనాలు, రోడ్డు చూడటానికి అవకాశం ఉంటుంది.
- అలాగే వాహనం వెనుక, పక్కన వచ్చే వాహనాలను చూడటానికి సైడ్ మిర్రర్స్ బాగుండాలి. దీంతోపాటు డ్రైవర్ తోపాటు అందులో ప్రయాణించేవారు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలి.
- నాలుగు టైర్ల వాహనాలకు తప్పనిసరిగా వీల్ అలైట్‌మెంట్, బ్యాలెన్సింగ్ అనేది చూసుకోవాలి. ఇంజిన్‌ఆయిల్, కూలెంట్, బ్రేక్ ఆయిల్ ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి.

స్పీడ్‌గా నడపొద్దు..

వర్షాకాలంలో వాహనాదారులు స్పీడ్‌గా వెళ్లవద్దు. వర్షం పడినప్పుడు రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతాయి. అక్కడ జాగ్రత్త వహించాలి. వాహనాలపై వెళ్లేవారు తమ వాహనాల కండిషన్‌ను చూసుకోవాలి. కార్లు, ఇతర వాహనాదారులు సీట్‌బెల్ట్‌తోతోపాటు బ్రేక్‌లు, వైపర్లు, ముందు గ్లాస్, సైడ్ మిర్రర్లు, లైట్లు మంచిగా ఉంచుకోవాలి.

– ప్రసాద్, ట్రాఫిక్ సీఐ, నిజామాబాద్

ఆర్మూర్‌లో అంతర్భాగమైన రాజస్థానీలు

మీకు తెలుసా?

ఆర్మూర్ పట్టణంలో అత్యధిక జనాభా గల ఖత్రి (క్షత్రియ సమాజ్) కులస్తుల ప్రస్థానం ఆసక్తికరంగా ఉంటుంది. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల సరిహద్దుల్లో గల మండవ్‌ఘడ్ ఖత్రిల పుట్టినిల్లు.



సహస్రార్జుని ప్రతిరూపం

- పట్టు చేనేత వస్త్రాలను నేస్తూ గుజరాత్, రాజస్థాన్‌లలో సరఫరా చేసేవారు. అప్పట్లో పట్టు వస్త్రాలకు ఉన్న డిమాండ్ మేరకు ఖత్రిలు ఉపాధి కోసం 500 సంవత్సరాల క్రితం ఉత్తరప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు వెళ్లారు.
- ఖత్రిలు మాట్లాడే భాషకు లిపి లేదు.
- పట్టు వస్త్రాల నేత పనే జీవనాధారంగా కొనసాగించిన ఖత్రి కులస్తులకు ఉపాధి కరువవడంతో ఇతర వ్యాపారాల్లో స్థిరపడ్డారు.



మధ్యప్రదేశ్‌లోని మహేశ్వరంలో సహస్రార్జునుడు నిర్మించిన కోట వద్ద ఖత్రిలు

- 64 వేల ఆర్మూర్ పట్టణ జనాభాలో 16 వేలకు పైచిలుకు ఖత్రి కులస్థులు ఉన్నారు.
- ఓటర్లు సైతం 10 వేలకు పైగా ఉండటంతో పరిపాలన, రాజకీయ రంగాల్లో సైతం వారికి ప్రత్యేక స్థానం ఉంది. పట్టు నేత ప్రధాన కులవృత్తిగా ఉన్న ఈ ఖత్రి కులస్థులను క్షత్రియులుగా కూడా సంబోధిస్తారు.
- పట్టు నేయడంతో పట్కరీలు అనే మరో పేరు సైతం వీరికి వచ్చింది.
- వీరు శివుడి భక్తుడైన సహస్రార్జునుని పూజిస్తారు. ఆయన వంశీకులుగా దేశంలోని అన్ని ప్రాంతాల్లో విస్తరించారు. – ఆర్మూర్

మైలు రాళ్లకు రంగులు వేటికి గుర్తులో తెలుసా?

సమాచారం..



ఖలీల్‌వాడి : మనం ప్రయాణించే సమయంలో రోడ్డు పక్కన మైలు రాళ్లు కనిపిస్తుంటాయి. అన్నింటికీ ఒకే రంగు కాకుండా వివిధ రకాల రంగులను చూస్తాం. రోడ్లను బాధ్యతలు చూసే శాఖలను ఈ రంగులు సూచిస్తాయి. పసుపు, తెలుపు రంగులో ఉంటే జాతీయ రహదారి(ఎన్‌హెచ్), ఆకుపచ్చ, తెలుపు వర్ణంలో ఉంటే స్టేట్ (రాష్ట్ర) రహదారి, నలుపు, తెలుపులో ఉంటే నగర, జిల్లా రహదారి, కాషాయం, తెలుపు రంగు ఉంటే గ్రామీణ రోడ్లుగా గుర్తించాలి. రెండు గ్రామాలను కలుపుతూ ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా వేసే రోడ్లకు కూడా కాషాయం, తెలుపు రంగు వేస్తారు.



ఒడ్డేపల్లి బీపీఎం సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఒడ్డేపల్లి బీపీఎం నిఖితను జిల్లా తపాలా అధికారులు సస్పెండ్ చేశారు. పొదుపు డబ్బులు స్వాహా అంటూ శుక్రవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి జిల్లా పోస్టాఫీస్ అధికారులు స్పందించారు. ఈమేరకు శనివారం ఒడ్డేపల్లి గ్రామంలోని పోస్టాఫీస్‌లో జిల్లా పోస్టాఫీస్ ఇన్‌స్పెక్టర్ సుజిత్, మానిటరింగ్ అధికారి వెంకట్రాంరెడ్డి విచారణ చేపట్టారు. ఖాతాదారులను కార్యాలయానికి పిలిపించి విచారణ చేపట్టారు. పొదుపు డబ్బులతో పాటు కొన్ని లావాదేవీలకు సంబంధించిన డబ్బులు జమచేయడంలో తేడాలు ఉన్నట్లు అధికారుల విచారణలో తేలింది. రెండు, మూడు రోజుల పాటు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని జిల్లా పోస్టాఫీస్ ఇన్‌స్పెక్టర్ సుజిత్ తెలిపారు. ఇన్‌చార్జీ బీపీఎం శశికాంత్ తదితరులు ఉన్నారు.



ఒడ్డేపల్లిలో విచారణ చేపడుతున్న జిల్లా తపాలాశాఖ అధికారులు

జన జీవనానికి పాట ప్రాణం లాంటిది



యువ గాయనీగాయకులకు బహుమతులు అందజేస్తున్న చంద్రకాంత్‌రెడ్డి, గఫూర్ శిక్షక్, తదితరులు

కామారెడ్డి అర్బన్: తెలంగాణ జన జీవనానికి పాట ప్రాణంలాంటిదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కర్షక్ బీఎడ్ కళాశాలలో యువ కళాకారులను ప్రోత్సహించడానికి ప్రజాయుద్ధనౌక గద్దర్ యాదిలో 'పాటకు సలామ్' పాటల వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పాటకు సలామ్‌తో యువ గాయకులు వెలుగులోకి వస్తారన్నారు. వర్క్‌షాప్ కళాకారుల అభివృద్ధికి దోహదం చేస్తుందని తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అన్నారు. సంగీత దర్శకుడు అష్ట గంగాధర్, గజల్ కవి సురారం శంకర్, అల్లి మోహన్‌రాజ్, ఎంఏ రషీద్, శ్యాంకుమార్, మౌర్య, జీవన్‌కుమార్, నాగభూషణం, కాశ నర్సయ్య, కమలకాంత్, రెడ్డి రాజయ్య, కాసర్ల రామచంద్రం, గంగాప్రసాద్, సంధ్య, సావిత్రి, రస్మిత, అక్షిత, సుజిత పాల్గొన్నారు. పాల్గొన్న యువ గాయనీగాయకులకు ధ్రువపత్రాలతో పాటు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.

కూరగాయల సాగుతో నిత్య ఆదాయం

- అర ఎకరంలో పలు రకాలను పండిస్తూ లాభాలను ఆర్జిస్తున్న గిరిజన రైతు పాండు

ఎల్లారెడ్డిరూరల్: వ్యవసాయంతో పాటు కూరగాయలను సాగు చేస్తు నిత్యం ఆదాయం పొందుతున్నాడు గిరిజన రైతు పాండు. అర ఎకరం పొలంలో బెండ, వంకాయ, బీరకాయ, పాలకూర, కొత్తిమీర పంటలను సాగు చేస్తు లాభాలను ఆర్జిస్తూ, ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

సాగుతోపాటు మార్కెట్లో విక్రయం..

ఎల్లారెడ్డి మండలంలోని జిత్యాతండాకు చెందిన పాండు తనకున్న రెండెకరాల పొలంలో అర ఎకరం కేవలం కూరగాయల సాగుకు మాత్రమే కేటాయించాడు. ఏడాది మొత్తం వివిధ రకాలైన కూరగాయలు, ఆకు కూరలు పంటలను సాగు చేస్తున్నాడు. తక్కువ మోతాదులో ఎరువులను వాడుతూ పంటలను సాగు చేస్తు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కూరగాయలను తెంపడం, కలపు తొలగించడం పనులు పూర్తయిన అనంతరం మార్కెట్‌కు వెళ్లి, కూరగాయలను విక్రయిస్తున్నారు. దళారులకు విక్రయించకుండా వారే విక్రయించడంతో అధిక లాభాలను అర్జిస్తున్నారు. అర ఎకరంలో అతడు భార్యతోపాటు కూరగాయల సాగు చేస్తూ ఏటా రెండు నుంచి రెండున్నర లక్షల రూపాయల ఆదాయాన్ని అర్జిస్తున్నారు.



బెండకాయలను తెంపుతున్న రైతు పాండు



బీరకాయలు, వంకాయలను పండిస్తున్న రైతు

కూరగాయల సాగుకే ప్రాధాన్యత ఇస్తా..



వ్యవసాయం కంటే కూరగాయల సాగు అంటేనే నాకు చాలా ఇష్టం. దీంతో నిత్యం పొలంలోకి వెళ్లి కూరగాయలను తెంపడం, వాటికి నీరు అందించడం లాంటి పనులను నా భార్యతో కలిసి చేస్తాం. కూరగాయలను కోసిన అనంతరం సాయంత్రం మార్కెట్‌కు వెళ్లి విక్రయిస్తాం.

– పాండు, రైతు, జిత్యాతండా

పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి



గాంధారిలో పోలీసుల నుంచి వందనం స్వీకరిస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు

గాంధారి(ఎల్లారెడ్డి): పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో స్నేహపూర్వంగా ఉండాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు అన్నారు. గాంధారి పోలీస్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మొదట ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది నుంచి పోలీసు వందనం స్వీకరించారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఎస్సైకి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సదాశివ నగర్ సీఐ సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

గాంధారి మండల పరిధిలోని మొండిసడక్ వద్ద ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు సీసీ కెమెరాలను ప్రారంభించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మొండిసడక్ వ్యాపారుల స్ఫూర్తితో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ సూచించారన్నారు.

బాలికల హాస్టల్ తనిఖీ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహాన్ని శనివారం జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ అధికారి సతీష్‌యాదవ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు పౌష్టిక, నాణ్యమైన భోజనాన్ని అందించాలని వార్డెన్ స్వప్నకు ఆదేశించారు. ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. అనంతరం హాస్టల్ ఆవరణలో మొక్కను నాటారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి



హన్మాండ్లు(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ముదెల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో పోకల హన్మాండ్లు(45) అనే రైతు శనివారం మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. హన్మాండ్లు కౌలు చేస్తున్న పొలంలోని బోరుమోటారు స్టార్టర్‌లో సమస్య రావడంతో మరమ్మతులకు యత్నించగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య శకుంతల ఫిర్యాదు మేరకు ఏఎస్సై నర్సయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు సివిల్ ఇంజనీర్ మృతి

- మృతుడు బాపట్ల వాసి



గణేశ్(ఫైల్)

నవీపేట: మండలంలోని కోస్లీ గ్రామ సమీపంలోని చెరువులో పడి ప్రైవేట్ సివిల్ ఇంజనీర్ గుత్తి ఉమా గణేశ్(30) మృతి చెందినట్లు ఎస్సై వినయ్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు .. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం వేటపాలెం మండల కేంద్రానికి చెందిన ఉమా గణేశ్ భైంసా నుంచి బోధన్ వరకు జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులలో సివిల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అనూష ప్రాజెక్ట్‌లో కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న గణేశ్, నిర్మల్ జిల్లా బాసరలోని కార్యాలయంలో ఉంటూ విధులకు వెళ్లేవాడు. కోస్లీ శివారులో మొరం తవ్వకాలు జరగడంతో పర్యవేక్షణకు శుక్రవారం సాయంత్రం బైక్‌పై వెళ్లి తిరిగి రాలేదు. శనివారం సాయంత్రం మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుని తండ్రి మల్లేశ్వర్‌రావ్‌కు సమాచారం అందించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. వృద్ధుడికి తీవ్రగాయాలు

డిచ్‌పల్లి: రోడ్డుపై వెళుతున్న వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన డిచ్‌పల్లి మండల కేంద్రంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ రెండో డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు (టీజీ 16టీ 2419) డిచ్‌పల్లి బస్టాండ్‌లో ప్రయాణిలను ఎక్కించుకొని నిజామాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపైకి వస్తుండగా రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి చెందిన మాల గొల్ల కృష్ణయ్యను ఢీకొట్టింది. బస్సు ముందు టైరు కిందపడిన కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు పాదం వరకు కాలును తొలగించాల్సిన అవసరం ఉందని, హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించినట్లు కృష్ణయ్య కుటుంబీకులు తెలిపారు. డ్రైవర్ అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయమై డిచ్‌పల్లి ఎస్సైను సంప్రదించగా ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



రుద్రూర్ : ఆరుబయట ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేసి గాయపర్చిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉ న్నాయి. మహతాజ్ అనే చిన్నారి ఆరు బయట ఆడుకుంటుండగా కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. గాయ పడిన మహతాజ్‌ను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


చోరీ కేసులో ఒకరి అరెస్టు

భిక్కనూరు: చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన దుబ్బాక సుజాత ఇంట్లో బంగారు కమ్మలు, రెండు జతల పట్టగొలుసులు, కర్నాల నర్సవ్వ ఇంట్లో నుంచి ఒక జత వెండి పట్టగొలుసులను శుక్రవారం దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టి చోరీకి పాల్పడిన కర్నాల రేణుకను అరెస్టు చేశారు. నిందితురాలి వద్ద బంగారు కమ్మలు, వెండి పట్టగొలుసులు స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ. 6450 నగదు, 8 ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాలలో పేకాట ఆడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

పెద్దపులి జాడ కోసం గాలింపు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిరికొండ: పెద్దపులి జాడ కోసం అటవీశాఖ అధికారు లు గాలింపు ముమ్మరం చే శారు. పాదముద్రలు లభ్యమైన చెరువుల పైభాగాన గల జినిగ్యాల అటవీ ప్రాంతంలో యానిమల్ ట్రాకర్స్ బృందం సభ్యులు, సిరికొండ రేంజ్ సిబ్బంది శనివారం గాలించినట్లు ఎఫ్‌ఆర్‌వో రవీందర్ తెలిపారు. మరెక్కడా పెద్దపులి అడుగులు కనిపించలేదని పేర్కొన్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న చీమన్‌పల్లి, పందిమడుగు, తెల్లపలుగు తండా, జినిగ్యాల తండాలలో అధికారులు అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఆర్వో గంగారం, పందిమడుగు సెక్షన్ అధికారి సాయికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.